

కథా కౌముది

# రిచ్ డాడ్ – పూర్ డాడ్

యండమూరి వీరేంద్రనాథ్.

పునర్ముద్రణ

**"రా మానవుడా రా..!** గుహాంతర్భాగంలోంచి నిప్పులు చిమ్ముకుంటూ బయటకు రా..” తాను వ్రాసిన పుస్తకంలోని గేయాల్ని మా తండ్రి ఆవేశంగా చదవటం పూర్తి చేయగానే ఆడిటోరియం చప్పట్లతో నిండిపోయింది. ఆ పుస్తకాన్ని సుదర్శనంగారు ఆవిష్కరిస్తూ, ప్రస్తుత వ్యవస్థకి అటువంటి పుస్తకాల అవసరం ఎంత ఉన్నదో చెప్పారు. ఆ తరువాత (మా తండ్రి పనిచేసే) ఫ్యాక్టరీ కార్మికులు సుదర్శనంగారిని కారు వరకూ సాగనంపారు. ఆయన ఏం చేస్తూ ఉంటారని నా స్నేహితుడు మధుని అడిగాను. నాలాగే వాడికీ పన్నెండేళ్ళ వయసుంటుంది. ఇలాంటి సభలకి హాజరయి, అందరికీ ప్రేరణ ఇస్తూ ఉంటాడని, ఫ్యాక్టరీలో పని చేసేవారి సంక్షేమం కోసం నిర్విరామంగా పని చేస్తూ ఉంటారని వాడు చెప్పాడు. నేను సరీగ్గా వినలేదు.

నా దృష్టి ఆయన “ఖరీదైన” కారు మీదే ఉంది.

ఆ సాయంత్రం నేను కుబేరం మావయ్యని కలుసుకున్నాను. ఆయన మా అమ్మకి స్వంత అన్నయ్యే అయినా, నాన్నకి ఆయనంటే పడదు. రెండు కుటుంబాలకీ పెద్దగా రాకపోకలు కూడా లేవు. "...వాడికి డబ్బు తప్ప మరేమీ కనపడదు. పేరు కూడా కరెక్టుగానే పెట్టారు. '...కు ' అంటే చెడు అని అర్థం. కుబేరం అంటే చెడు బేరం" అంటాడు నాన్న.

కుబేరం మావయ్యకి దాదాపు వంద కోట్ల ఆస్తి ఉంటుందని అంచనా. రెండు మూడు పెద్ద ఫ్యాక్టరీలు కూడా ఉన్నాయి. బంధువులందరూ ఆయనని వెలి వేశామంటారు కానీ నాకూ, మధుగాడికీ మాత్రం వేరే అభిప్రాయం ఉంది. వాళ్ళని కలుసుకోవటానికి ఆయనకే సమయం దొరకదని...! అయినా ప్రయత్నించటంలో తప్పు లేదనుకుని

ఆయన దగ్గరకు వెళ్ళాం. అరగంట తరువాత లోపలకు పిలిచాడు. చాలా చిన్న గది. చెక్కల తాపడం. క్రింద తివాచీ అక్కడక్కడా చిరిగి ఉంది. కుబేరం మావయ్యకి బట్టతల, చిన్న పొట్ట ఉన్నాయి. అయినా మనిషి హుందాగా ఉన్నాడు. మమ్మల్ని చూసి "...ఏరా! ఇలా వచ్చారు. ఏమిటి సంగతి?" అని అడిగాడు. తలవంచుకుని నెమ్మదిగా చెప్పాను. "...డబ్బు సంపాదించటమెలాగో నేర్చుకుందామని"

మావయ్య బిగ్గరగా నవ్వుతాడనుకున్నాను. నవ్వలేదు. "...మీ నాన్నని అడిగే వచ్చావా?" అన్నాడు. అడిగానని చెప్పాను. నిజానికి నాన్న తిడతాడేమోనని భయపడ్డాను. కానీ పుస్తకావిష్కరణ సభ గొప్పగా జరిగిన ఆనందంలో ఆయన నా మాటలకి అంత ప్రాముఖ్యత ఇచ్చినట్టు కనబడలేదు.

మా కోరిక విని మావయ్య అందర్లా ఆశ్చర్యపోలేదు. "సరే...మీకు డబ్బు సంపాదించటం ఎలాగో నేర్పుతాను. ప్రతి సాయంత్రం వచ్చి రెండు గంటలు పని చేయండి. రోజుకి చెరో రూపాయి ఇస్తాను" అన్నాడు. ఇద్దరం మొహాలు చూసుకున్నాం. దీన్ని మేము ఊహించలేదు. నెలకు ముప్పై రూపాయలు పెద్ద ఎక్కువ కాకపోయినా, డబ్బు ఇస్తూ చదువు నేర్పే వారెవరు? అందుకని ఆనందంగా ఒప్పుకున్నాం. "...రేపటి నుంచీ వస్తాం. ఈరోజు క్రికెట్ మ్యాచ్ ఉంది" అన్నాను ఎగ్రిమెంటు సంతకం చేస్తున్న స్టయిల్లో.

మామయ్య కరుగ్గా "...చేరితే ఈరోజు చేరండి. లేకపోతే వెళ్ళిపోండి" అన్నాడు. మధు బిక్కమొహం పెట్టాడు. మా వీధి జట్టుకి వాడే కెప్టెన్. కానీ నాకెందుకో క్రికెట్ కన్నా ఇదే ఉత్సాహంగా అనిపించింది. వాడి తరఫున కూడా నేనే సమాధానం ఇచ్చాను. "...వస్తాము! ఈరోజు నుంచే."

ప్రతిరోజూ ఆఫీసు రూము దుమ్ము దులపటం, కాగితాలు నీట్గా వరుసక్రమంలో పెట్టటం వగైరా మా పని. పది రోజులు చేసిన తరువాత బోరు కొట్టటం మొదలైంది. మామయ్య ముసలి సెక్రటరీ రోజూ రూపాయి ఇచ్చేది. ఆయన మాత్రం కనపడలేదు. మరో అయిదు రోజులు గడిచేసరికి నేనొక నిర్ణయనికి వచ్చి "...నేను పని మానేద్దామనుకుంటున్నాను" అని మధుకి చెప్పాను. "...ఇదే విషయాన్ని ఈ రోజు నేనూ నీకు చెప్దామనుకునాను" అన్నాడు

నిజానికి నాన్న కూడా, "...సాయంకాలాలు సరదాగా ఆడుకోకుండా, రూపాయి కోసం ఆ పన్లేమిట్రా? మానెయ్యండి" అన్నాడు. అమ్మ తన అన్నయ్యని తిట్టింది కూడా.

ఇద్దరం వెళ్ళి ముసలి సెక్రటరీకి ఆ విషయం చెప్పాం. ఆవిడ నవ్వి "...మీరు తొందర్లోనే ఇలా అంటారనీ, అప్పుడు తన దగ్గరకి పంపించమనీ మీ మామయ్య చెప్పారు" అంది. కుబేరం మామయ్య ఇలా ఊహిస్తాడని మేము అనుకోలేదు. ఆశ్చర్యపోయాం.

ఆ సాయంత్రం మామయ్యని కలుసుకుని ఉద్యోగం మానేస్తున్నామని చెప్పాం. ఎందుకని అడిగాడు. అంతే..! నాకు ఒక్కసారిగా ఆవేశం, దుఃఖం వచ్చాయి. రోషంగా "చిన్నపిల్లల్ని చేసి మాతో పని చేయించుకున్నావ్. సాయంత్రాలు ఆటలు మానేసి నీకోసం కష్టపడి పని చేశాం. నీకు కృతజ్ఞత లేదు. ఈ ఊళ్ళో అందరూ నీ గురించి ఏమనుకుంటున్నారో అది కరెక్టే. నువ్వు కసాయివాడివి. నీకోసం పని చేసేవారి మీద నీకు అభిమానం లేదు. ఒక్క రూపాయిచ్చి, పది రూపాయల పని చేయించుకుంటున్నావ్" అన్నాను. కసితో ఆపైన మాటలు రాలేదు.

మామయ్య మా ఇద్దరివైపూ కన్నార్పకుండా ఒక్క క్షణం చూసాడు. ఆ తరువాత, సన్నగా నవ్వుతూ "ఫర్వాలేదు. పది రోజుల్లోనే నా క్రింద పని చేసే ఉద్యోగస్థుల 'భాష' నేర్చుకున్నావ్" అన్నాడు. ఆ మాటలకి లోపల్నుంచి మరింత ఉక్రోషం తన్నుకొచ్చింది. "...నేను నీ క్రింద పనిచేసే ఉద్యోగిని కాను. అయినా, ఇలా చిన్న కుర్రాళ్ళతో పని చేయించుకోవటం నేరం. మా నాన్న చెప్పాడు. నిన్ను అరెస్ట్ చేయించవచ్చు" అన్నాను.

ఈసారి మామయ్య కొంచెం బిగ్గరగా నవ్వి, "..ఉద్యోగంలోంచి తీసేస్తున్నానని తెలిసినప్పుడు మా వర్కర్లు, వారి తరఫున యూనియన్ లీడర్లు ఇలాగే మాట్లాడతారు..." అన్నాడు.

"...నువ్వు తీసెయ్యటమేమిటి? నేనే మానేస్తున్నాను. అయినా నీకు మాట మీద నిలకడ లేదు. నాకు సంపాదించటం నేర్పుతానని ఆశపెట్టి పని చేయించుకున్నావు. ఒక్క ముక్క నేర్పలేదు."

మామయ్య కుర్చీ వెనక్కి వాలి, "...నేర్పుతూనే ఉన్నాగా" అన్నాడు తాపీగా.

నేనూ, మధు ఉలిక్కిపడి ఒకర్నొకరు చూసుకున్నాం.

ఈలోపులో మామయ్య అన్నాడు. "...నేర్పటం అంటే, క్లాసురూం లెక్చర్ అనుకున్నారా?"

మేము మాట్లాడలేదు. మామయ్య కొనసాగించాడు. "క్లాసుల్లో చెప్పేది చదువు. జీవితం చెప్పేది పాఠం. ఒక్కొక్క అనుభవం ఒక్కో లెక్చరర్. '...నేర్చుకో నేర్చుకో' అని చెప్తూ ఉంటుంది అనుభవం. కొందరు దాన్ని జీవితంలో భాగంగా మామూలుగా తీసుకుంటారు. ఒకరిద్దరు మాత్రమే 'నేర్చుకుంటారు'. చాలామంది చిరాకు పడతారు.

కోపగించుకుంటారు. తమ చేతకానితనం మీద కాదు. ఎదుటి వారిమీద! భార్యమీదో, భర్తమీదో, పిల్లలమీదో – లేదా– ఇప్పుడు మీరు ఎగిరిపడినట్టు, తమ యజమానిమీదో..."

నాకొద్దిగా అర్థమయినట్టు అనిపించింది. నిజానికి మేము ఉద్యోగం మానేసి వెళ్ళిపోదల్చుకుంటే, మామయ్యని ఇంత తిట్టనవసరం లేదు. నా మాటలకి క్షమాపణ చెప్పబోతూంటే మామయ్య అన్నాడు. "జీవిత పాఠాల నుంచి ఏమీ నేర్చుకోనివాడు అన్నీ కరెక్టుగానే చేస్తున్నాననుకుంటాడు. జీవితంలో ఇం...కా... ఎ...ప్పు...డో... ఏ...దో... జరుగుతుందని ఊహిస్తూ, మొత్తం మీద జీవితాంతం చాలా కష్టపడతాడు. అణకువగా, మర్యాదగా ఉంటాడు. స్నేహితులు అతడిని '...పాపం చాలా కష్టపడతాడు. నిజాయితీ పరుడు' అని పొగుడుతూ ఉంటారు. కానీ అతడి అంతర్గత అధైర్యమూ, రిస్కు తీసుకోలేని స్వభావమూ అతడిని అలా మార్చాయని అతడితో సహా ఎవరూ గ్రహించరు. ఎందుకంటే, అతడి చుట్టూ ఉన్న ప్రపంచమంతా అలాంటిదే కాబట్టి...! ఎవరో ట్యూన్ చేసిన పాటకి అతడి జీవితం నాట్యం చేస్తూ ఉంటుంది. అకస్మాత్తుగా డబ్బు అవసరం వస్తుంది. కానీ అప్పటికే వయసు పైబడి ఉంటుంది. పునాదే బలహీనమైనప్పుడు ముసలి వయసు వచ్చాక భవంతి ఎలా కడతాడు? యవ్వనంలో చాలా సులభమైన పనులు ముసలితనం వచ్చేసరికి చాలా కష్టంగా అనిపిస్తాయి. 'డబ్బు కోసం 'అంత' కష్టపడనవసరం లేదని చిన్నప్పుడే తెలుసుకుని ఉంటే మరింత బాగుండేదని బాధపడతాడు" మామయ్య ఆగి కొనసాగించాడు. "నా దగ్గర పనిచేసే 1500 మంది కార్మికుల్లో, ఉద్యోగస్తుల్లో ఎవరూ కూడా మీలా ఇలా వచ్చి '...డబ్బు సంపాదించటం ఎలాగో నేర్పమని అడగలేదు. ఈ వయసులోనే మీకు ఇంత ఆర్థిక స్పృహ ఉండటం ఆనందకరం. చాలామంది పెద్దలు, వాళ్ళ పిల్లలకి చిన్నప్పుడే డబ్బు సంపాదన నేర్పరు. తమలాగే బాగా చదువుకుని, బాగా కష్టపడి, బాగా సె...టి...ల్ అయితే చాలనుకుంటారు. వయసొచ్చాక అదెలాగూ తప్పదని అనుకుంటూ, పిల్లల బాల్యాన్ని "రక్షిస్తూ" ఉంటారు. అలా కాకుండా మీ సాయంత్రాన్ని ఈ విధంగా పెట్టుబడి పెట్టటం నచ్చి, మీకు ఉద్యోగం ఇచ్చాను."

"కానీ రోజుకి రూపాయి చాలా తక్కువ" కసిగా అన్నాను.

"ఆ సమస్య నాది కాదు. మీది" తాపీగా అన్నాడు మామయ్య. "సమస్య పట్ల మీ దృక్పథం మార్చుకోవటం మంచిది. మీ సమస్యకి కారణం 'నేను ' అని అనుకుంటే, మీరు నన్ను మార్చాలి. 'నువ్వే నీ సమస్య' అనుకుంటే, నువ్వు మారాలి. ఏది సులభమో ఆలోచించు. ... ... నేను మారనన్నవాడు గొంగళిలా పడి ఉంటాడు. ఇప్పుడు నా దగ్గర పని చేయకపోతే, ఆడుకోవటం తప్ప నీకేం పని ఉంది?"

"వేదాంతం మానేసి, నా జీతం పెంచు. లేకపోతే ఉద్యోగం మానేస్తాం."

"చాలామంది చేసేది అదే. ఏడాది చివర వచ్చే ఇంక్రిమెంటు కోసం పని చేయటం. లేదా జీతం పెంచమనటం. లేదా ఒక చోట మానేసి మరొక చోట మరో మం...చి ఉద్యోగం సంపాదించి, అదే గెలుపు అనుకోవటం...! దానివల్ల సమస్య తీరిపోయిందనుకుంటారే తప్ప, ఆ సమస్య మరో ఏడాది వరకూ పక్కనే పొంచి ఉంది అనుకోరు."

"మరేం చెయ్యమంటావ్? నువ్వు జీతం ఎప్పుడు పెంచుతావా అని ఎదురుచూస్తూ పని చెయ్యమంటావా?"

"అది సమస్యకి పరిష్కారం చెప్పదు."

"మరేది చెపుతుంది?"

కుబేరం మామయ్య నా దగ్గరగా వచ్చి, చెవుల పైన ఉన్న కణతల మీద రెండు చూపుడు వేళ్ళూ పెట్టి "...వీటి మధ్య ఉన్నది చెపుతుంది" అన్నాడు.

నాకెందుకో అప్రయత్నంగా వళ్ళు జలదరించినట్టు అయింది. ఈ జలదరింపు ఆ తరువాత జీవితంలో గెలిచిన ప్రతిసారీ ఫీలయ్యాను. గెలుపులో వచ్చే సంతోషం కన్నా, ఓడిపోతామేమో అన్న భయం ఎక్కువైన వారందరూ సామాన్యులుగా ఉండిపోతారన్న (ఇప్పుడు నేర్చుకున్న) ఈ విషయాన్ని, ఆ తరువాత నా జీవితం ఎన్నోసార్లు నిరూపించింది. దానికి ప్రారంభం మా స్కూలే..! స్కూల్లో ఆటలు మానేసి, 'రూపాయుద్యోగం' (ఆ పేరు నా స్నేహితులే పెట్టారు) చేయటం వారికి పిచ్చితనంగా కనపడింది. మాకు మాత్రం, 'మేము వేరే...మిగతా పిల్లలు వేరే' అన్నటుగా అనిపించేది. బహుశ విశ్వనాథన్ ఆనంద్, మైకేల్ జాక్సన్లకు కూడా ఇలాగే అనిపించి ఉండవచ్చు.

కుబేరం మామయ్య చెప్పే థియరీలు చాలామందికి అర్థం కావు. మా నాన్న లాంటివాళ్ళకి అసలు కావు.

"...అన్ని అనర్థాలకీ డబ్బే మూల కారణం" అంటాడు నాన్న. "...అన్ని అనర్థాలకీ డబ్బు లేకపోవటమే మూల కారణం" అంటాడు కుబేరం మామయ్య. డబ్బుంటే ఆనందం వస్తుంది అనుకోవటం భ్రమ అని నాన్న అంటాడు. డబ్బంటే లెఖ్ఖ లేకపోవటం ఆనందం లో ఒక భాగమని మావయ్య అంటాడు. జీతం కోసం నిజాయితీగా కష్టపడి పని చేయాలని నాన్న అంటాడు. ఆనందం కోసమూ, థ్రిల్ కోసమూ పనిచేస్తే, కాంప్లిమెంటరీగా డబ్బు దానంతట అదే వస్తుందని మామయ్య అంటాడు. "...విజయవంతంగా చదువు పూర్తి చేస్తే మంచి కంపెనీ కళ్ళకద్దుకుని

ఉద్యోగం ఇస్తుంది! కాస్త కష్టపడి మంచి ర్యాంకులు తెచ్చుకుంటే, జీవితాంతం కాలు మీద కాలేసుకుని బ్రతకవచ్చు" అంటాడు నాన్న. "...చదువనేది స్కూల్తో పూర్తవదు. ఆ మాటకొస్తే, అప్పటినుంచే ప్రారంభమవుతుంది! యవ్వనంలో కాలుమీద కాలు వేసుకుని వుండటం “పక్షవాత” లక్షణం. విజయవంతంగా పని చేస్తే పదిమందిని ఇంటర్వ్యూలకి పిలిచి నువ్వే మంచి ర్యాంకర్ని సెలెక్ట్ చేసుకోవచ్చు" అంటాడు మామయ్య.

నేనీ విధంగా ఆలోచిస్తూ ఉండగా, "ఏమిటి ఆలోచిస్తున్నావు? నాకాట్టే టైం లేదు. నేను చెప్పింది నచ్చిందా లేదా?" అన్న మామయ్య మాటలకి ఈ లోకంలోకి వచ్చాను. అప్పటికే మధు, తను ఉద్యోగం కంటిన్యూ చేస్తానన్నట్టు తలూపాడు. నేను కూడా, 'చేస్తానుగానీ, రోజుకి రూపాయి మరీ తక్కువ.' అందామనుకున్నాను. కానీ, రామాయణమంతా విని రాముడికి సీత ఏమవుతుంది? అని అడిగినట్టు ఉంటుందని, అంగీకరిస్తున్నట్టు తలూపాను. అప్పుడన్నాడు మామయ్య "సరే అయితే. వెళ్ళి పని మొదలు పెట్టండి. ఈ రోజు నుంచీ మీకు జీతం ఇవ్వటం లేదు".

ఆకాశం విరిగి మీద పడ్డట్టు అయింది. ఆయన చెప్పిందీ, మేము విన్నదీ ఒకటేనా అన్న అనుమానం కలిగింది. "ఇది అన్యాయం" అంటూ మధు అరిచాడు. మామయ్య మొహంలో ఏ భావమూ లేదు. "... మొదట మీరు జీతం లేకుండా నేర్చుకుంటామన్నారు. ఇప్పుడు జీతం పెంచమంటున్నారు. మీకు జీతం అలవాటయితే, అదిగో, ఆ పక్కగదిలో నా ముసలి సెక్రటరీలాగా, నేను ఎప్పుడు తీసేస్తానో అన్న ‘భయం’ తో, ఎప్పుడు జీతం పెంచుతానా అన్న ‘ఆశ’తో పని చేస్తారు. చేస్తూనే ఉంటారు.... .... ... నాకెక్కువ టైం లేదు. మీరు వెళ్ళిపోవటానికి నిశ్చయించుకున్న పక్షంలో ఇప్పటికే మీతో ఎక్కువ సమయం గడిపాను" అన్నాడు కరుగ్గా. నా దృష్టి, మామయ్య ఆఫీసు రూమ్ కిటికీలోంచి వరండా బయట కనపడుతూన్న వాషింగ్ మిషిన్ మీద పడింది. మనసుని ఉతికి ఆరేస్తున్నట్టు ఉంది అది. "చేస్తాను" అన్నాను.

"వాడు దుర్మార్గుడు...మిమ్మల్ని మాటలతో హిప్నటైజ్ చేసి ఆడిస్తున్నాడు" అన్నాడు నాన్న. (నాకెందుకో సుదర్శనంగారు గుర్తొచ్చారు. మాటలతో అవతలివారిని హిప్నటైజ్ చేసి ఆడించటం మోసమైతే, ఆయనా దుర్మార్గుడే. ఆయన ఖరీదైన కారు, అవతలి వారిని మోసం చేసిన డబ్బులతో కొన్నదే అనిపించింది). అమ్మ డైనింగ్ టేబిల్ సర్దుతూ, తన అన్నయ్యని తిట్టింది. "...అందుకే వాడికి అందరూ దూరమయ్యారు" అంది.

నిజానికి కుబేరం మామయ్యకి అందరూ దూరం అవ్వలేదు. ఆయన పిలిస్తే చాలామంది దగ్గరకు వెళ్తారు. ఆయన పిలవడు. అనవసరంగా తాను '...దగ్గరవటం ' ఆయనకి ఇష్టం లేదు.

మారిన నా భావాల గురించి మామయ్య దగ్గర చెప్పినప్పుడు, నవ్వి "...యజమానులపట్ల వర్కర్లకి కూడా అదే భావం ఉంటుంది. వాళ్ళని తిడతారు. మళ్ళీ వాళ్ళ కిందే పని చేస్తారు. వాళ్ళలా మారటానికి ప్రయత్నించరు. లేదా, తమలో లేనిది, ఆ యజమానులలో వున్నదని ఒప్పుకోరు. తాము ఎక్స్ప్లాయిట్ కాబడుతున్నాము అన్న భావన, వారికి సంతృప్తిని ఇస్తుంది. సుదర్శనం లాంటి వారు ఆ ఉక్రోషాన్ని తమ ఉపన్యాసాల ద్వారానో, రచనల ద్వారానో క్యాష్ చేసుకుంటూ ఉంటారు. అవి వింటూ, చదువుకుంటూ, తమని తాము తిట్టుకుంటూ, సణుక్కుంటూ జీవితాన్ని గడిపేస్తారే తప్ప, వేరు మార్గాల్ని అన్వేషించరు. మరీ కోపం వస్తే స్ట్రయిక్ చేసి, జీతం పెరగ్గానే, అదే గెలుపు అని సంతృప్తి పడతారు. వారి దృష్టిలో యజమాని రాక్షసుడు. అతడి క్రింద పని చేయవలసి రావటం తమ ఖర్మ! ఎంత చిత్రమో చూడు!! దీన్నే value judgement అంటారు. అవతలివారిని ఎప్పుడైతే “నీ” values తో చూశావో, అప్పుడు, వారు నీకు అదే విధంగా కనబడతారు. ఉదాహరణకి, ఒక అద్భుతమైన మేధావి ఉన్నాడనుకో! అన్ని రంగాల్లోనూ అతడు నెం.1. కానీ అతనికి ఉన్న ఒకే వ్యసనం తాగుడనుకో. అతడి గురించి ఇంకెవరితోనైనా చెప్పవలసి వస్తే ‘అతడో తాగుబోతు’ అంటావు. అతడి తాలూకు 'మిగతా' గొప్పతనం ఏదీ గుర్తించవు. నీ దృక్పథంతో చెప్తావు. అతడి గురించిన నీ జడ్జిమెంటులో కాస్త అసూయ కూడా ఉంటుందనుకో...! సాధారణంగా జనం అంతా అలానే చేస్తూ ఉంటారు. తనకంటూ నిజంగా value ఉన్నవాళ్ళు, జనం జడ్జిమెంట్లకు విలువ ఇవ్వరు. నేనంటే మీ అమ్మకీ నాన్నకీ పడకపోవటానికి కారణం కూడా ఇదే..! కానీ నా విషయం అలా కాదు. వాళ్ళిద్దరినీ నేను అభిమానిస్తాను. నాకు వాళ్ళలో నచ్చనిదల్లా వాళ్ళ సంపాదనా పద్ధతీ, నెలసరి జీతం కోసం పనిచేయటం..!”

"వాళ్ళకీ నీ పట్ల అదే అభిప్రాయం ఉంది. నీ సంపాదనా పద్ధతి వాళ్ళకి నచ్చదు. ఇరవై నాలుగ్గంటలూ డబ్బు సంపాదనే తప్ప, నీకు జీవితాన్ని అనుభవించటం చేతకాదనీ, నలుగుర్నీ మంచి చేసుకోవటం అస్సలు తెలీదనీ వారి అభిప్రాయం" అన్నాను.

మావయ్య కఠినంగా, "నలుగుర్నీ మంచి చేసుకోవలసిన అవసరం నాకు లేదు” అన్నాడు. “...ఆ విషయం పక్కన పెట్టు. ఇక నా సంపాదనా పద్దతి గురించి నీకు కాస్త వివరించాలి. నేను ఇరవై నాలుగ్గంటలూ డబ్బు సంపాదనలో మునిగి ఉంటానని ఎందుకనుకున్నావు? మనిషికి డబ్బు పిచ్చి ఉండకూడదని నమ్మేవాళ్ళలో నేను ప్రథముడిని. అయితే, డబ్బు లేకపోవటం వల్ల వచ్చే సమస్యలేవీ నాకు రాకూడదని నా కోరిక. అందుకే సంపాదిస్తున్నాను.

అయినా సంపాదించకుండా ప్రొద్దున్నుంచీ సాయంత్రం వరకూ ఏం చెయ్యను? అన్నట్టు మీ నాన్న రోజూ ఆఫీసుకి ఎన్నింటికి వెళ్ళి, ఎన్నింటికి వస్తాడు?" అని అడిగాడు.

"ప్రొద్దున్న తొమ్మిదింటికి వెళ్ళి, సాయంత్రం ఏడింటికి..."

"ఎప్పుడైనా మూడు రోజులు వరుసగా సెలవు కావలసి వస్తే?"

"ఒక ఆదివారానికి మరో రెండు రోజులు కలిసి వచ్చేలా పెడతాడు" అన్నాను.

"మరి నేను...?"

సమాధానం చెప్పబోతూ చప్పున ఆగిపోయాను. మామయ్య ఏం చెప్పదలుచుకున్నాడో అర్థమయింది. తనకి '..పని ' ఒక వ్యాపకం. అంతే తప్ప అవసరం కాదు. ఆఫీసుకి ఇష్టమొచ్చినప్పుడు రావచ్చు, లేదా మానేయొచ్చు. నాన్న అలా కాదు. తప్పనిసరిగా వెళ్ళాల్సిందే. కానీ...మామయ్యకి ఈ స్థితి ఎలా వచ్చింది? కొత్త రకంగా ఆలోచించటం వల్లనా? ...నాకు సమాధానం దొరికినట్టయింది. ఆయన మొహంలోకి సూటిగా చూస్తూ, "...నీలాగా అందరూ చిన్నప్పటినుంచీ వ్యాపారం ప్రారంభించ లేరు. ఒకవేళ అలా చేసినా, లాభాలు రావాలన్న రూలేమీ లేదు. ఒకసారి స్థిరపడ్డాక ఎదుటివారికి ఎన్నైనా సూత్రాలు చెప్పొచ్చు. ఎదుటివారి జీవితాన్ని ఎద్దేవా చేయొచ్చు" అన్నాను in a satirical tone.

మామయ్య నవ్వేడు."...డబ్బు సంపాదించాలంటే కేవలం వ్యాపారమే పెట్టనవసరం లేదు. సరైన ఆర్థికావగాహన వుండాలంతే. రిస్క్ లేకుండా డబ్బు సంపాదించే వ్యాపకాలు ఎన్నో ఉన్నాయి. నేను నా ఆఫీసుకీ ఫ్యాక్టరీకీ ఎందుకు వస్తానో తెలుసా? ఇక్కడికి రాకపోతే పేకాటకో, రేసులకో వెళ్ళాలి. దానికన్నా నాకీ ఆఫీసే ఇంట్రెస్టు. మీ నాన్నకి అలా కాదు. ఆఫీసు ఆయనకొక తలనొప్పి వ్యవహారం...చాలామందికి అదే దృక్పథం. అందుకే ఇంటిని ఒక 'విశ్రాంతి సాధనం'గా భావిస్తారు. యవ్వన కాలంలోజవసత్వాలు నూరు శాతం స్థాయిలో ఉన్నప్పుడు కూడా, ఆ ఖాళీ టైమ్ ని భవిష్యత్తు కోసం పెట్టుబడిగా పెట్టరు".

ఆ చివరి మాటలకి నాలో ఏదో ఎక్కడో కదిలినట్టు అనిపించింది.

"మనిషికి అసంతృప్తి ఎప్పుడు కలుగుతుంది? ఆరోగ్యం బాగులేకపోవటం వల్ల, డబ్బు లేకపోవటం వల్ల, తననెవరూ గుర్తించటం లేదన్న ఒంటరితనం వల్ల! అవునా...! ఆరోగ్యం మన చేతిలో లేదు. మిగతా రెండూ మన

చేతిలోనే ఉన్నాయి. కనీసం ఆ రెండు సమస్యల్నీ కాసింత కష్టంతో ఒక్కసారి అధిగమిస్తే, డబ్బూ గుర్తింపూ అవే వస్తాయి. ఒకసారి అవి రావటం ప్రారంభిస్తే ఇక వాటికి అంతుండదు. వాటి గురించి ఆలోచించనవసరం లేదు. అప్పుడిక భవిష్యత్ జీవితం గురించి మనకిష్టమైన రీతిలో హాయిగా ఆలోచించవచ్చు. వాల్యూ–జడ్జిమెంట్ అనేది ప్రతివ్యక్తీ తప్పని సరిగా తెలుసుకోవలసిన విషయం. ఒక కుర్రవాడికి వెనీలా ఐస్క్రీం అంటే ఇష్టమనుకుందాం. ఊహ తెలిసినప్పటి నుంచీ, మరణించే వరకూ అదే తింటూ ఉంటే, ఆ తరువాత మార్కెట్లోకి ప్రవేశ పెట్టబడిన స్ట్రాబెర్రీ, కాసెట్టాల రుచి తెలుసుకునే అవకాశం జీవితంలో రాదు. ఎప్పుడూ మామూలు "...టీ" త్రాగే వ్యక్తికి లెమన్ టీ, బ్లాక్ టీ, ఇలాచీ టీ, పౌనా, చైనీస్ టీ, మసాలా టీ మొదలైన వాటిలో మరింత రుచి ఉందేమోనని తెలుసుకోవాలనే ఇంట్రెస్ట్ ఉండదు. మార్పుకి ఇష్టపడని వ్యక్తి, ఒక వస్తువుకి ఒక 'వేల్యూ' ఆపాదించుకుంటాడు. మిగతా వాటి విలువలు గ్రహించటానికి ఇష్టపడడు. "వాల్యూ జడ్జిమెంట్ లేకపోవటం" అంటే అదే..."

ఒక రహస్యం బోధపడినట్టు "...ఇవన్నీ అందరూ అందరికీ ఎందుకు చెప్పరు?" అని ప్రశ్నించాను.

"చాలామందికి తెలీదు. తెలిసిన వాళ్ళు చెప్పరు. 90% నిర్దేశించిన పరిధిలోంచి బయటికి రావటానికి ఇష్టపడరు. మీ స్కూల్లో నీ క్లాస్మేట్స్ నే తీసుకో. నిన్ను చూసి అందరూ జాలి పడుతున్నారు. అవునా? వాళ్ళలా సాయంత్రం పూట టీ.వీ. చూడటం కన్నా, మీరెక్కువ సంతోషంగా వున్నారన్న విషయాన్ని వారు చచ్చినా నమ్మరు..! నమ్మలేరు..!! మీ పెద్దలకి కూడా ఈ సంగతి అర్థం కాదు. ఈ పెద్దలూ, మేధావులూ, గవర్నమెంటూ అందరూ ఈ వ్యవస్థనే ప్రోత్సహిస్తారు. కొద్దిమందికే అసలు విషయం తెలుసు. వారి చేతిలో క్యారెట్ ఉంటుంది. ఎద్దుని బండికి కడతారు. దాంట్లో హాయిగా కూర్చుని... వారు క్యారెట్ ఎటు తిప్పితే బండి అటు వెళుతుంది. ప్రభుత్వాన్నీ, మేధావుల్నీ తమ చేతిలోకి తీసుకుని, తమకి కావలసిన విధంగా వ్యవస్థని నిర్మించుకుంటారు. గమనించి చూడు. ఒక వర్కరు తన జీతంలో కంపల్సరీగా కొంత శాతం టాక్స్ కట్టాలి. ఆటోమాటిక్ గా అది జీతంలోంచి కట్ అయిపోతుంది. వ్యాపారస్తుడి విషయం అలా కాదు. అతడి కారుకీ, విలాసవంతమైన అతిథి గృహాలకి కూడా టాక్సులో రాయితీ లభిస్తుంది. ప్రభుత్వం కూడా వారినే ప్రోత్సహిస్తుంది. ఎందుకంటే... 'పనిచేసేవారు తండోపతండాలు..! పని చేయించుకునేవారే తక్కువ' అని ప్రభుత్వానికి తెలుసు..."

చెప్తూ మామయ్య ఆగాడు. ఫైలు క్రింద కనబడిన డబ్బు చూసి "ఇదెవరు పెట్టారు?" అని అడిగాడు. మేము మాట్లాడలేదు. సెక్రటరీని పిలవబోతూంటే "...మేమే" అన్నాను నేను.

మామయ్యకు అర్థం కాలేదు. అయోమయంగా చూస్తూ "ఎందుకు?" అన్నాడు.

కొంచెం తటపటాయించి "...నీకు తెలియకుండా నీ వాషింగ్ మెషీన్ చాలా రోజుల్నుంచీ మేము ఉపయోగించు కుంటున్నాము మామయ్యా. నీ దగ్గర రోజుకి గంటసేపు తప్ప పనిలేదు. మిగతా టైంలో, తెలిసిన వారందరి బట్టలూ ఉతికించి, ఇస్త్రీ చేసి ఇచ్చాము. కరెంటు చార్జీలు చెల్లించటం మా బాధ్యతగా భావించాము" చెప్పాను.

ముందు అవాక్కై, ఆపై మేము చెపుతున్నది అర్థమై, చేతిలోని డబ్బువైపు చూసి, "ఇంత కరెంటు చార్జీలు అయ్యాయా?" అని అడిగాడు. నేను తల దించుకుని, "నిన్ను మోసం చెయ్యటంగానీ, నీ రుణం ఉంచుకోవటం గానీ మాకిష్టం లేదు మామయ్యా. మిషన్ అరుగుదల – డిప్రిసియేషన్ కూడా లెఖ్ఖ కట్టాము" అన్నాను

అప్పుడు కనబడింది మామయ్య మొహంలో ఆశ్చర్యం. డబ్బు తిరిగి వెనక్కి ఇస్తాడనుకున్నాను. ఇవ్వకుండా, డ్రాయర్లో దాన్ని పడేసి, "మీలాంటి వాళ్ళే నాక్కావాలి. ఈరోజు నుంచీ మీ జీతం రోజుకి రెండు రూపాయలు చేస్తున్నాను" అన్నాడు.

నేను "...సారీ మామయ్యా. చాలా తక్కువ" అన్నా.

"అయిదు రూపాయలు"

నేను మధూ వైపు చూసాను. తల అడ్డంగా ఊపాడు.

"రోజుకి వంద..."

"ఊహూ"

"రోజుకి వెయ్యి ఇస్తాను"

నా గుండె కొట్టుకోవటం ఆగిపోయింది. నెలకు ముప్పై వేలు. అంటే మా నాన్న జీతానికి రెట్టింపు...!! అయినా అది అంత థ్రిల్లింగ్గా అనిపించలేదు.

మామయ్య వాషింగ్ మెషీన్ లాంటివి ఈ ప్రపంచంలో ఇంకా చాలా ఉన్నాయి. అదే చెప్పాను. "...నీ ఆఫీసు బూజు దులపటం నాకు ఇక ఉత్సాహం కలిగించదు మామయ్యా. దాని కన్నా ముఖ్యంగా..." ఆగి పూర్తి చేశాను "...ఒకరి క్రింద పని చేయటం." నా మాటలు పూర్తి కాలేదు. మామయ్య మా ఇద్దరి దగ్గరకూ వచ్చి, చేతులు విశాలంగా సాచి మమ్మల్ని దగ్గరకు తీసుకున్నాడు.